ఈనాడు జనగామ

మంగళవారం సెప్టెంబరు 1, 2026

సమీక్షలో పాల్గొన్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, ఎంపీలు వేంనరేందర్‌రెడ్డి, కడియం కావ్య, బలరాంనాయక్, ఎమ్మెల్యేలు రాంచంద్రునాయక్, మురళీనాయక్, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య

విధుల్లో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం

అధికారులకు మంత్రి పొంగులేటి హెచ్చరిక

ఈనాడు, వరంగల్ - మహబూబాబాద్, కేసముద్రం రూరల్, ఇనుగుర్తి, న్యూస్‌టుడే: పారదర్శకంగా పనిచేసి ప్రజలకు మంచి చేసే అధికారులను ప్రోత్సహిస్తామని.. విధుల్లో తప్పు చేస్తే ఉపేక్షించేది లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఉమ్మడి వరంగల్ జిల్లా అధికారుల సమీక్షలో పొంగులేటి మాట్లాడారు. 22ఎ, భూవివాదాలపై సొంత నిర్ణయాలు తీసుకోవద్దని.. నిబంధనలకు విరుద్ధంగా ఉత్తర్వులు జారీ చేసి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావద్దన్నారు. కార్యాలయాలకు పరిమితం కాకుండా కనీసం నెలలో ఒకటి, రెండుసార్లు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని సూచించారు. సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలోనూ పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ఆలస్యం తగదని.. ప్రైవేటు సర్వేలకు పరిమితమవుతూ ప్రభుత్వ సర్వేలకు హాజరుకాని లైసెన్స్‌డ్ సర్వేయర్లకు నోటీసులు జారీ చేయాలని మంత్రి ఆదేశించారు. సబ్‌రిజిస్ట్రార్లు చట్టానికి అనుగుణంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, యశస్వినిరెడ్డి, మాధవరెడ్డి, కేఆర్ నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, సత్యనారాయణరావు

డబ్బు వసూళ్లపై ఫిర్యాదులు..: ఇందిరమ్మ ఇళ్లకు 5 కి.మీ పరిధిలో ఉచితంగా రవాణా చేసే ఇసుకకు ట్రాక్టర్ యజమానులు రూ.5 వేల చొప్పున వసూలు చేస్తున్నట్లు మంత్రి సమావేశంలో పేర్కొన్నారు. రవాణా ఛార్జీలను శాస్త్రీయంగా నిర్ణయించాలని సూచించారు. వాటిని బోర్డుల మీద ప్రదర్శించాలని కలెక్టర్లకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నుంచి డబ్బు వసూలు చేసినట్లు ఫిర్యాదులొస్తే సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మంత్రి సీతక్క, ఎంపీలు వేంనరేందర్‌రెడ్డి, బలరాంనాయక్, కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రాంచంద్రునాయక్, మురళీనాయక్, యశస్వినిరెడ్డి, కడియం శ్రీహరి, దొంతి మాధవరెడ్డి, కేఆర్ నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, రెవెన్యూశాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్, ఐఏఎస్ అధికారి రాజీవ్‌గాంధీ హనుమంతు, కలెక్టర్లు స్నేహ శబరీష్, చాహత్ బాజ్‌పాయ్, సత్యశారద, సందీప్‌కుమార్, రాహుల్ శర్మ, బోర్డాడే సహదేవ్‌రావు తదితరులు పాల్గొన్నారు. వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) సంధ్యారాణి, గృహనిర్మాణ ఇన్‌ఛార్జి పీడీ కృష్ణమూర్తిని మంత్రి సన్మానించారు.

● హైదరాబాద్ తరహాలో అల్పాదాయ వర్గాల కోసం ప్రభుత్వ, లబ్ధిదారుల వాటా ధనంతో వరంగల్‌లోనూ అపార్ట్‌మెంట్లు నిర్మిస్తామని మంత్రి ప్రకటించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలో 480, పశ్చిమ నియోజకవర్గంలో 480 ప్లాట్ల చొప్పున తొలుత నిర్మాణాలు చేపట్టేందుకు భూమిని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం..: కేసముద్రంలో పలు అభివృద్ధి పనులకు మంత్రులు పొంగులేటి, సీతక్క, ఎంపీ వేంనరేందర్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు సోమవారం శ్రీకారం చుట్టారు. రూ.1.90 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్తు ఉపకేంద్రాన్ని ప్రారంభించారు. రూ.6.50 కోట్లతో నిర్మించనున్న పురపాలక సంఘ కార్యాలయ భవనాన్ని, ఇనుగుర్తి, దంతాలపల్లి, సీరోలు మండల కేంద్రాల్లో రూ.6.75 కోట్లతో నిర్మించనున్న రెవెన్యూ కార్యాలయాల భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

గణపేశ్వరుడు.. అర్ధనారీశ్వరుడు



కాకతీయుల కాలం నాటి కోటగుళ్లలో శ్రావణమాసం, స్వామివారికి ప్రీతికరమైన సోమవారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గణపేశ్వరుడిని విభూతి, గంధంతో అర్ధనారీశ్వరుడిగా ప్రత్యేకంగా అలంకరించారు. విభూతి స్వామివారిగా, గంధం అమ్మవారిగా కొలిచారు. – న్యూస్‌టుడే, గణపురం

రైల్వే ప్రాజెక్టులకు భూసేకరణపై సమీక్ష

జనగామ, న్యూస్‌టుడే: రైల్వే డబుల్‌లైన్ పనులు, ఇతర ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ, కలెక్టర్ల బాధ్యతపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రాష్ట్ర రోడ్ల రవాణ ప్రత్యేక కార్యదర్శి వికాస్‌రాజ్ దృశ్యమాధ్యమ సమీక్ష నిర్వహించారు. జనగామ కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఈ సమీక్షకు హాజరయ్యారు. కలెక్టర్లు తమ పరిధిలో జరుగుతున్న పనులకు సంబంధించి భూసేకరణ పురోగతిపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించినట్లు పేర్కొన్నారు.

పడిగాపులు.. ప్రదక్షిణలు

'సర్' విచారణ పర్వం అస్తవ్యస్తం

జనగామ, న్యూస్‌టుడే: ఓటరు జాబితాల సమగ్ర సవరణ కార్యక్రమం(సర్)లో 2002 జాబితాను అనుసరించి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని నోటీసులు అందుకున్న ఓటర్లకు తిప్పలు తప్పడం లేదు. జనగామ పట్టణ ఓటర్లలో సుమారు ఆరు వేల మందికి నోటీసుల జారీచేస్తున్నారు. వారం రోజుల వ్యవధి నిబంధన అమలు కాకపోవడం తొలి ఇబ్బందిగా మారింది. పోలింగ్ స్టేషన్లను మూడు విభాగాలుగా వర్గీకరించి, స్థానిక మున్సిపల్, తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో ఏఈఆర్వోలు, అదనపు ఏఈఆర్వోల ఎదుట హాజరు కావాలని ఆదేశించారు. ఈ నెల 29న ఈ ప్రక్రియ ప్రారంభమైంది. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. మరో రెండు కార్యాలయాల్లో ప్రత్యేక కారణాలతో జరగలేదు. మున్సిపల్ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో ఓటర్లు హాజరయ్యారు. నోటీసులో సూచించిన పత్రాలు లేని వారు ఏం చేయాలో అధికారులు వివరించ లేకపోయారు.

ప్రణాళిక లోపంతో ఇబ్బందులు

విచారణ పర్వాన్ని సక్రమంగా నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు లేకపోవడంతో, ఓటర్లతో పాటు అధికారులకు ఇబ్బంది తప్పలేదు. విచారణకు నోటీసుదారులే కాకుండా వారి తరఫున ఎవరైనా రావచ్చునని చెప్పినా, తమ ఓటు పోతుందనే భయంతో వచ్చామని వృద్ధులు, నడవలేని వారు చెప్పారు. ఈ ప్రక్రియను కార్యాలయం పై అంతస్తులో నిర్వహించడంతో మెట్లు ఎక్కలేక అనేక మందికి అవస్థలు తప్పలేదు. భోజన విరామం తర్వాత కొందరు బీఎల్వోలు కనిపించకపోవడంతో వారి కోసం ఓటర్లు ప్రదక్షిణ చేశారు. ఆధార్, పాన్‌కార్డు, రేషన్‌కార్డులు పని కిరావని కొర్రీ పెట్టడంతో అదనపు పత్రాల కోసం పరుగులు పెట్టాల్సి వచ్చింది. ఇక బీఎల్వోలు సదరు పత్రాలను ఆన్లైన్ చేర్చిన వివరాలను, అదనపు ఏఈఆర్వో పరిశీలించి వివరాల నమోదు, వారితో ఫొటో తీసుకునేందుకు ఒక్కో ఓటరుకు 15 నిమిషాలు పడుతోంది. ఇరుకైన గదిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఇబ్బందికి దారి తీసింది.

నోటీసులు అందుకున్న ఓటర్ల రద్దీ

ఇలా చేయాలి..

పోలింగ్ స్టేషన్ల వారిగా నోటీసులు ఇచ్చిన బీఎల్వోలు ఓటర్లను నేరుగా కలిసి, ఎలాంటి ధ్రువపత్రాలు అవసరమో సూచించి, వాటిని ఆన్లైన్లో చేరి, నిర్దేశిత గడువు రోజు విచారణ అధికారి వద్ద హాజరు పర్చేలా చూడాలి. మూడు కార్యాలయాల్లో ఓటర్లకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఓటర్లు కోరుతున్నారు.

వృద్ధులకు తప్పని తిప్పలు..

వృద్ధ ఓటర్లు

ఈ చిత్రంలోని తల్లీ సల్ల బాలమ్మ 83 ఏళ్లు, ఆమె కూతురు మాస పూలమ్మ 60 ఏళ్లు. వీరికి నోటీసులు అందడంతో విచారణకు వచ్చారు. దశాబ్దాలుగా ఓట్లు వేస్తున్నామని, తమ వద్ద ఆధార్, రేషన్ కార్డు మాత్రమే ఉన్నాయని, పింఛన్ పుస్తకం లేదని చెప్పారు. ఈ ఆధారాలు సరిపోకపోతే తమ ఓటు పోతుందా అని ఆందోళన చెందారు. జనగామ 29 వార్డుకు చెందిన 77ఏళ్ల బేజిని సాయమ్మది ఇదే ఆందోళన.

ఎంసీహెచ్‌లో కోతుల హల్‌చల్



వార్డులో సంచరిస్తున్న వానరం

జనగామ మాతా, శిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్)లో కోతులు హల్‌చల్ చేస్తున్నాయి. గర్భిణులు, బాలింతలు, వారి తరపు సహాయకులు, సందర్శకులతో కిక్కిరిసి ఉండే ఆసుపత్రిలో కోతుల బెడద తీవ్రమైంది. ఆసుపత్రిలో ప్రసూతి వార్డులు, నవజాత శిశువుల వార్డుల్లోకి కోతులు రావడంతో భయాందోళన వ్యక్తమవుతోంది. కరవడానికి రావడంతో ఆసుపత్రిలో భయంగా ఉందని సందర్శకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కోతుల బెడదను నివారించాలని వారు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, జనగామ టౌన్

అంగన్‌వాడీ కేంద్రాలకు వెలుగులు

జనగామ టౌన్, న్యూస్‌టుడే: చిన్నారుల తొలి అడుగులకు అంగన్‌వాడీ కేంద్రాలు వేదికలు.. అక్కడే ఆట పాటలతో పాటు అక్షరాభ్యాసం, పోషకాహారం, ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాలకు వివిధ కారణాలతో విద్యుత్తు సౌకర్యం లేక చిన్నారులు, అంగన్‌వాడీ సిబ్బంది ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వం కొన్ని నెలల కిందట అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్తు సౌకర్యం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జనగామ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు కొన్ని నెలలుగా కనెక్షన్లు ఇచ్చే పనులను టీజీఎన్పీడీసీఎల్ అధికారులు ప్రత్యేక చొరవతో చేశారు.

విద్యతో పాటు వసతులు

జిల్లా వ్యాప్తంగా మొత్తం 517 అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చే ప్రక్రియ పూర్తయింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుత్తు సౌకర్యం అందుబాటులోకి రావడంతో బల్బులు, ఫ్యాన్లు పనిచేస్తున్నాయి. దీంతో తాగునీటి వసతి కూడా మెరుగుపడింది. అన్ని కేంద్రాల్లో బోర్లకు మోటార్లను బిగించుకుంటున్నారు. ఇటీవలే ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ-స్కూల్స్‌గా మార్చడంతో విద్యార్థుల చదువుకు ఎలాంటి ఇబ్బంది రాకుండా దోహదం కానుంది.

కార్యకర్తలకు వెసులుబాటు

విద్యుత్తు సౌకర్యం ఇవ్వడం వల్ల చిన్నారులకే కాకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాలకు ఉపయోగకరంగా మారింది. రోజువారీ కార్యకలాపాలు, రికార్డుల నిర్వహణ, చిన్నారుల అభ్యసన కార్యక్రమాలను సౌకర్యంగా చేపట్టేందుకు అవకాశం కలిగింది. దీంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తరిగొప్పలలో అంగన్‌వాడీ కేంద్రానికి విద్యుత్తు కనెక్షన్ ఇచ్చిన సిబ్బంది

అన్ని కేంద్రాల్లో పూర్తిస్థాయిలో....

- చెరుకు సంపత్‌రెడ్డి, ఎస్‌ఈ, టీజీఎన్పీడీసీఎల్ జనగామ సర్కిల్

జిల్లా వ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చే ప్రక్రియను పూర్తి చేశాం. అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బందిని సమన్వయం చేసుకుని వేగంగా అన్ని కేంద్రాలకు కనెక్షన్లు ఇచ్చాం.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహాధర్నా

కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శనలో పాల్గొన్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ధన్వంతి, పార్టీ నాయకులు

జనగామ, న్యూస్‌టుడే: హల్ద్వానీ ఘటనకు నిరసనగా గళమెత్తిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై భాజపా ఆధ్వర్యంలోని ఉత్తరాఖండ్ ప్రభుత్వం కేసు నమోదు చేయడాన్ని వ్యతిరేకిస్తూ డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ద్వేష రాజకీయాలతో రాహుల్‌గాంధీ ప్రజాస్వామిక పరిరక్షణ పోరాటాన్ని ఏ శక్తి అడ్డుకోలేదన్నారు. సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువల పరిరక్షణకు గళమెత్తిన ప్రతిపక్ష నేతపై కేసు నమోదు చేయడం భాజపా కక్షపూరిత వైఖరికి నిదర్శనమన్నారు. టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లక్ష్మీనారాయణనాయక్ మాట్లాడుతూ రాహుల్ గాంధి పోరాటానికి పార్టీ శ్రేణులు వెన్నంటి ఉంటాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ వి.సత్యనారాయణరెడ్డి, లొక్కుంట్ల ప్రవీణ్, వేముల మల్లేశ్, సీహెచ్ మల్లేశం, ఎస్.పరమేశ్, జాయమల్లేశ్ ఇతరులు పాల్గొన్నారు.

☛ కాంగ్రెస్ జిల్లా కమిటీల ఎన్నికలో భాగంగా ఓబీసీ సెల్ నూతన కమిటీల ఏర్పాటుకు ఈ నెల 3 నుంచి 5 వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని పార్టీ ఓబీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎల్.ప్రవీణ్ ప్రకటించారు.

గృహ వినియోగానికి విద్యుత్తు బిల్లు రూ.1.43 లక్షలు

బిల్లు చూపుతున్న వినియోగదారుడు ప్రసాద్

ములుగు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఓ వినియోగదారుడికి విద్యుత్తు బిల్లు రూ.లక్షల్లో రావడంతో అయోమయానికి గురవుతున్నారు. అది చెల్లించే వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు కనెక్షన్ తొలగించారు. బాధితుడి కథనం మేరకు.. ములుగు మున్సిపాలిటీ పరిధిలోని ప్రేమ్‌నగర్‌కు చెందిన కొమ్మినేని ప్రసాద్ పెంకుటింట్లో నివాసం ఉంటున్నారు. 2023వ సంవత్సరం మొదట్లో గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్లలోపు కరెంటు వినియోగంతో మూడు నెలల పాటు జీరో బిల్లు వచ్చింది. తరవాత నుంచి సిబ్బంది అసలు బిల్లు ఇవ్వలేదు. గత నెల ఒకేసారి రూ.వేలల్లో బిల్లు వచ్చిందని సిబ్బంది వచ్చి మీటరు బిల్లు ఇచ్చి వెళ్లారు. ఆగస్టు నెలలో మొత్తం బిల్లు రూ.1,43,136 మేరకు బకాయి పేరుకుపోయిందని బిల్లు ఇచ్చారు. రెండు ఫ్యాన్లు, టీవీ, ఫ్రిడ్జ్‌తోపాటు మూడు ఎల్ఈడీ బల్బులను ఉపయోగిస్తున్నారు.

కాళేశ్వరుడికేదీ చాటు.. ఎవరిదీ పొరపాటు

కాళేశ్వరం, న్యూస్‌టుడే: కాళేశ్వరంలో రూ.కోట్ల వ్యయంతో ఆలయ పునర్నిర్మాణ పనులు సాగుతున్నాయి. అయితే ఇక్కడ కనీస భద్రత చర్యలు పాటించడం లేదు. ఆలయాలు, రాజగోపురాలు, ప్రాకారాలను తొలగించిన ప్రాంతమంతా చాటు లేక బట్టబయలుగా ఉంది. దీంతో భక్తులు, పశువులు నేరుగా నిర్మాణ ప్రాంతాల్లోకి వెళ్తున్నారు. ఏడాది క్రితం ప్రారంభమైన వేములవాడ రాజరాజేశ్వర గుడి పునర్నిర్మాణ పనుల్లో రేకుల చాటు ఏర్పాటు చేసిన విధంగా కాళేశ్వరంలో నిర్లక్ష్యం కొనసాగుతుండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతోన్నాయి.

☛ దేవస్థానం రాతి కట్టడాల పునర్నిర్మాణాల్లో అధికారులు, గుత్తేదారులు మొదటి నుంచి నెమ్మదిని పాటిస్తున్నారు. ఆలయాలు, ప్రాకారాలు తొలగించిన వెంటనే ఆ ప్రాంతాన్నంతా రేకులతో, లేదంటే పరదాలతో చాటు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. సాధారణంగా గృహాలు, షాపింగ్ మాల్స్ ఇతరత్రా నిర్మాణాలు జరిగినప్పుడు, వాటి యజమానులు పరదాలు, రేకులను ఏర్పాటు చేసుకోవడం పరిపాటి. దీంతో ఇతరులు ఆ ప్రాంతానికి వెళ్లకుండా దృష్టిని నియంత్రించొచ్చు.

ప్రమాదాలకు ఆస్కారం..: కాళేశ్వర క్షేత్రంలో రూ.198 కోట్లు వెచ్చించి పునర్నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఇంత పెద్ద మొత్తం వెచ్చిస్తుండగా.. చిన్న పనులకే అధికారులు ఇబ్బంది పడుతున్నారా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతోన్నాయి. భారీ యంత్రాలతో పెద్ద పెద్ద గోతులు తీస్తుండగా.. ప్రజలకు, పశువులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ప్రధానంగా పుణ్యక్షేత్రం నిర్మాణాలు జరిగినప్పుడు బాహ్య ప్రపంచానికి కనబడకుండా చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా ద్విలింగాలకు రక్షణ కవచం ఏర్పాటు చేసినప్పటికీ.. భక్తులు, ప్రజలు నేరుగా వెళ్లి ద్విలింగాలు ఎలా ఉన్నాయో? అని చూసి వస్తున్నారు. ఎంతో ప్రసిద్ధిగాంచిన ఆలయానికి చాటు వ్యవహారం తప్పనిసరి అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గుత్తేదారులకు ఆర్‌అండ్‌బీ అధికారులు, క్షేత్రస్థాయి అధికారులు సూచించినా పట్టింపు కరవైందని తెలిసింది. చాటు నిర్మాణాలకు సుమారు రూ.5 లక్షల వ్యయం అవుతుందని, ప్రొవిజన్ లేదని అధికారులు, గుత్తేదారులు తెగేసి చెబుతున్నట్లు సమాచారం.

ఆలయాలు తొలగించిన ప్రదేశం

ద్విలింగాలకు భద్రత కరవు: ద్విలింగాలకు భద్రత కరవైంది. కొంతమంది భక్తులు నేరుగా వెళ్లి ఆ ప్రాంతమంతా కలియతిరగడమే కాకుండా, సెల్ఫీలు దిగుతున్నారు. చాటు ఏర్పాటుతో పాటు ప్రధానంగా నిఘా నేత్రాలు తప్పనిసరి. అయితే ఇక్కడ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారుల స్పందించి వెంటనే స్పందించాల్సిన అవసరం ఉంది. ఇటీవల దేవాదాయశాఖ కమిషనర్ నిర్మాణాల పనులపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ విషయంపై 'న్యూస్‌టుడే' రహదారుల భవనాల శాఖ ఎస్ఈ రమేశ్‌ను చరవాణిలో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

రేపటి నుంచి ఎరువుల బుకింగ్‌కు కొత్త యాప్

జనగామ, న్యూస్‌టుడే: ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ యూరియా బుకింగ్‌యాప్ స్థానంలో రేపటి నుంచి ఎఫ్ఎఫ్ఎస్(ఫ్రేమ్‌వర్క్‌ఫర్ ఫర్టిలైజర్ సేల్)యాప్ ద్వారా ఎరువుల బుకింగ్ జరుగుతుందని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూరియా, డీఏపీ, ఎంవోపీ(పొటాష్), కాంప్లెక్సు ఇతర సబ్సిడీ ఎరువులను డిజిటల్ విధానంలో పారదర్శకంగా సరఫరా చేసేందుకు ఈ వ్యవస్థ ఉపకరిస్తుందన్నారు. రైతులు తమ చరవాణుల ద్వారా ఈ యాప్‌ను వినియోగించి రైతు గుర్తింపు సంఖ్య ,అగ్రిస్టాక్ వివరాల ఆధారంగా బుకింగ్ చేసుకోవచ్చునన్నారు.

పప్పుదినుసుల పంట పండింది!

గతేడాదితో పోల్చితే పెరిగిన సాగు

హనుమకొండ వ్యవసాయం, న్యూస్‌టుడే: ఎల్‌నినో ప్రభావంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరి సాగు బాగా తగ్గింది. ఈ నేపథ్యంలో రైతులు పప్పుదినుసుల సాగు వైపు మొగ్గు చూపారు. ఎక్కువగా కంది, పెసర, మినుములపై దృష్టి మళ్లించారు. గతేడాది వానాకాలంతో పోలిస్తే సాగు విపరీతంగా పెరిగింది. కంది సాగు ఒక ములుగు జిల్లాలో తగ్గగా, పెసర అన్ని జిల్లాల్లో పెరిగింది. మినుములు మహబూబాబాద్ జిల్లాలో ఈసారి భారీగా సాగైంది. ములుగు జిల్లాలో గతేడాదితో పోల్చితే 12 ఎకరాలు తగ్గింది. భూపాలపల్లి జిల్లాలో 50 ఎకరాలు సాగు చేయగా, ఈ ఏడాది ఒక్క ఎకరం కూడా సాగు చేయకపోవడం గమనార్హం. జనగామలో కేవలం 9 ఎకరాలకే పరిమితమైంది.

వర్ధన్నపేట మండలం ల్యాబర్తి గ్రామంలో సాగు చేసిన కంది పంట

ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో చెరువులు, కుంటల్లో నీరు లేకపోవడంతోపాటు పలు వాగుల మధ్యలోని చెక్‌డ్యాంలు సైతం ఎడారిని తలపిస్తున్నాయి. దీనికి తోడు ఎస్సారెస్పీ, మిడ్‌మానేరు నుంచి నీళ్లు వదలకపోవడంతో కాల్వలు సైతం బోసిపోతున్నాయి. గతేడాది వరి పంట ఎక్కువగా సాగు కావడంతో పప్పుదినుసుల పంటలు అంతంత మాత్రంగానే సాగయ్యాయి. ఈ ఏడాది వరి సాగు తగ్గింది, రైతులు పప్పుదినుసుల సాగుపై ఆసక్తి చూపారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పప్పుదినుసుల సాగు వివరాలు (ఎకరాల్లో) ● 2025 / ● 2026

జిల్లా	కంది 2025	కంది 2026	పెసర 2025	పెసర 2026	మినుములు 2025	మినుములు 2026
వరంగల్	435	827	185	10,830	70	85
హనుమకొండ	268	1,625	127	2,556	0	47
మహబూబాబాద్	400	2,623	1,728	21,489	38	1,200
ములుగు	78	50	30	51	51	39
భూపాలపల్లి	38	842	76	8,273	50	0
జనగామ	3,477	7,475	1,247	3,411	116	9

ఉపాధి పనులకు ప్రణాళిక

నేటి నుంచి ప్రత్యేక గ్రామసభల ఏర్పాటు

దామెర, న్యూస్‌టుడే: గ్రామాల్లోని కూలీలకు పని కల్పనే ధ్యేయంగా ప్రారంభమైన వీబీజీ రామ్‌జీ పథకంలో భాగంగా వికసిత్ భారత్-2047 లక్ష్యానికనుగుణంగా గ్రామీణాభివృద్ధిని సాధించేందుకు సెప్టెంబరు 1 నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించనున్నారు. గ్రామ పంచాయతీల వారీగా చేపట్టాల్సిన పనులను గుర్తించి, ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. వాస్తవ అవసరాలు, అందుబాటులోని వనరులు, మౌలిక వసతుల లోటుపాట్లను గుర్తించి, ప్రాధాన్యతా క్రమంలో పనులను రూపొందించే సమగ్ర ప్రణాళికను గ్రామసభలో రూపొందించనున్నారు.

వివిధ శాఖల అనుసంధానం

వీబీజీ రామ్‌జీలో ప్రస్తుతం 22 శాఖలకు అనుసంధానం చేశారు. ఇందులో ప్రధానంగా పంచాయతీరాజ్, అటవీ, సెర్ప్, వ్యవసాయం, విద్య, మత్స్య, ఉద్యాన శాఖ, టీజీ రెడ్కో, డెయిరీ, గృహనిర్మాణ, సెరీకల్చర్, ఎస్బీఎం తదితర శాఖలను అనుసంధానం చేస్తూ పనులను కల్పించనున్నారు.

జిల్లాల వారీగా గ్రామ పంచాయతీలు

హనుమకొండ	210
వరంగల్	317
ములుగు	174
మహబూబాబాద్	482
భూపాలపల్లి	248
జనగామ	280

గుర్తించాల్సిన పనుల విభాగాలు

వీబీజీ రామ్‌జీ పథకంలో భాగంగా 318 పనులను అధికారులు సూచిస్తున్నారు. కాగా వీటిని నాలుగు విభాగాలుగా విభజించారు. నీటి భద్రత (107), గ్రామీణ మౌలిక వసతులు (90), జీవనోపాధి మౌలిక వసతులు (86), విపత్తుల నివారణ (35)

హనుమకొండ జిల్లా దామెరలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో

ప్రణాళికల తయారీకి మార్గదర్శకాలు

✦ ప్రతి గ్రామంలో ఎంపీడీవో లేదా ఏపీవో లేదా టీఏలు రథసారథులుగా బృందాల ఏర్పాటు, ప్రతి గ్రామంలో మొదటి, తుది గ్రామసభలు నిర్వహించాలి. ✦ మొదటి గ్రామసభలో వీబీజీ రామ్‌జీ ద్వారా కల్పించే పనులపై కూలీలకు అవగాహన కల్పించాలి. ✦ వివిధ శాఖల అధికారులందరూ విధిగా హాజరై తమ శాఖకు అవసరమైన పనులను గుర్తించి ప్రణాళికలో చేర్పించాలి. ఆయా పనులను జీపీఎస్ లొకేషన్ ఆధారంగా పరిశీలించాలి. ✦ తుది గ్రామసభలో గుర్తించిన పనులను ప్రాధాన్యతా క్రమంలో సూచిస్తూ వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికల ఆమోదం చేపట్టాలి. ✦ చివరి గ్రామసభలో ప్రతిపాదిత పని పేరు, లబ్ధిదారుడి వివరాలు, అంచనా వ్యయం, చేపట్టబోయే శాఖ, పనులు చేపట్టే ఆర్థిక సంవత్సరాన్ని రూపొందించాలి.

WALK-IN INTERVIEW

రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న బల్క్‌డ్రగ్ పరిశ్రమ ప్రొడక్షన్ విభాగంలో పనిచేయుటకు ఈ క్రింది అర్హతలు, శారీరక దారుఢ్యం మరియు మంచి ఆరోగ్యం గల అభ్యర్థులు కావలెను.

2022 to 2026 PASSED OUT CANDIDATES

Job Title	Qualification		Stipend (P.M)
Trainee Helper	S.S.C , Inter / ITI (Fitter, Electrical, Diesel Mechanic)		Rs. 15,000/-
Trainee Supervisor/ Graduate Apprentice	B.Sc (Chemistry/Microbiology)	Age 21 - 25 years	Rs. 18,000/-
	B.Pharmacy B.Tech (Chemical/Mechanical/ Electrical/ECE/CSE/EIE)		Rs. 20,000/-
	M.Sc (Organic Chemistry/ Analytical Chemistry /Micro Biology)		Rs. 22,000/-
	M.Pharmacy (Pharmaceutical Chemistry/ Analysis/QA/RA)		Rs. 24,000/-

పై అర్హతలు గల అభ్యర్థులు తమ బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్స్ మరియు జిరాక్స్ కాపీలను తీసుకొని ఈ క్రింది ప్రదేశాలలో జరుగు ఇంటర్వ్యూకు హాజరు కాగలరు. ఎంపిక కాబడిన అభ్యర్థులు షిఫ్ట్‌లలో పనిచేయవలసియుండును.

B.Com & B.Sc (Computers) Candidates are also eligible

03-09-2026	ST. PETER'S INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES Vidyanagar, HANUMAKONDA
04-09-2026	SAHASRA INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES Near Ayyappa Swamy Temple, AREPALLY, Warangal

Interview Time : 9:00 am to 03:00 pm

సదుపాయములు: 1.బ్యాచ్‌లర్స్‌కు (పురుషులు) ఉచిత వసతి 2.ఉచిత యూనిఫాం 3.అర్హులైన వారికి PF, ESI ఇవ్వబడును 4.భోజన ఖర్చులో రాయితి

Issued by : SSM Manpower Services
Cyberhills Colony, PJR Nagar, Gachibowli, Hyderabad, Telangana.
Contact : 08694-257001

(c) eenadu

మిరప నాటు.. సస్యరక్షణ చర్యలు

రైతేరాజు

వెంకటాపూర్, న్యూస్‌టుడే: 'వాణిజ్య సాగులో ప్రధానమైన పంట మిరప. ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులు ఎక్కువ మిర్చి సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే నారు పోసుకున్న రైతులు నాట్లు ప్రారంభించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు మిరప సాగుకు అనుకూలంగా ఉన్నాయి. కర్షకులు సైతం ఉత్సాహంగా సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. మిరప నాటే సమయంలో సరైన జాగ్రత్తలు పాటించకపోతే దిగుబడిపై ప్రభావం చూపుతుందని' ఉద్యానశాఖ ములుగు డివిజన్ అధికారి.జె. శ్రీకాంత్ 'రైతేరాజు'కు వివరించారు. మొక్కలు నాటే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యల గురించి వివరించారు.

దుక్కిని ఇలా సిద్ధం చేయాలి..

● వర్షాధారంగా నల్లరేగడి, నీటి వసతి ఉన్న చోట చెలకల్లో సైతం సాగుచేసుకోవడం కోసం వేసవిలో లోతు దుక్కులు చేసుకోవాలి. ● తొలకరి వర్షం కురవగానే పచ్చి రొట్ట ఎరువులైన జీలుగ, పెసర, ఉలవ, అలసంద జనుము లాంటివి వేయాలి. పూత దశకు రాగానే(45రోజుల) భూమిలో కలియదున్నడం మేలు. ● ఇదే సమయంలో ఎకరానికి 50 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్ చల్లుకోవాలి. 200 కిలోల వేప పిండి కూడా చల్లితే నేల ద్వారా సంక్రమించే వ్యాధులను నివారించొచ్చు. ● ఇలా సిద్ధం చేసిన నేలను రెండు మూడు సార్లు కలియదున్ని, నారు 30 నుంచి 40 రోజులు రాగానే ప్రధాన పొలంలో నాటుకోవాలి.

నాటే సమయంలో జాగ్రత్తలు

● ఎలాంటి పురుగు, తెగుళ్ల లక్షణాలు లేని బలమైన మొక్కలను మాత్రమే ఎంపిక చేసుకోవాలి. ● నేల పరీక్షల ఆధారంగా ఎరువులు, సేంద్రియ ఎరువులను వేయాలి. ● పొలంలో నీరు నిల్వ లేకుండా, వర్షపు నీరు సాఫీగా బయటకు వెళ్లే విధంగా చూడటం మంచిది. ● నారు దెబ్బతినకుండా వేర్లకు మట్టి అంటుకొని ఉండేలా చూడాలి. మొక్కల మధ్య 60, 40 సెం.మీటర్ల దూరం ఉండటం ఉత్తమం. ● మొక్కలను లోతుగా, పైపైన నాటొద్దు. నాటిన వెంటనే తేలికపాటి నీటి తడిని అందించాలి. ● ఉదయం, సాయంత్రం వేళల్లోనే నాటాలి. ఎండ సమయంలో దూరంగా ఉంటే మేలు. ● నాటిన కొన్ని రోజుల వరకు నేలలో తడి ఉండేలా చూసుకోవాలి. డ్రిప్ ద్వారా నీటి తడులు అందించాలి. ● నాటిన తర్వాత నారు చనిపోవడం, పురుగులు, తెగుళ్లు ఆశిస్తున్నాయో లేదో ప్రతిరోజు పరిశీలించాలి.

తక్కువ పెట్టుబడి.. ఎక్కువ రాబడి

వెంకటాపురం, న్యూస్‌టుడే: తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి వచ్చే కూరగాయల సాగు చేస్తూ.. లాభాలు ఆర్జిస్తున్నారు ములుగు జిల్లా వెంకటాపురం మండలం పాత్రాపురం గ్రామానికి చెందిన సాధనపల్లి నాగేంద్ర రావు. ఆటో నడుపుతూ జీవనం సాగించే ఈయన ప్రత్యామ్నాయ ఆదాయ వనరుపై దృష్టి సారించారు. ఇంటి పెరటిని కూరగాయల సాగుకు మలుచుకుంటే ఏడాది పొడవునా ఆదాయం పొందొచ్చని నిరూపించారు. తనకున్న 20 గుంటల భూమిలో బీర, కీర, అలసంద, చిక్కుడు, దోస, కాకర, వంగ, బెండ, మునగ పంటలు వేస్తున్నారు. హైబ్రీడ్ రకం విత్తనాలను కొనుగోలు చేసి తీగజాతి పంటను ఏర్పాటు చేశారు. సుమారు రూ.30 వేలు పెట్టుబడి పెట్టి జూన్‌లో విత్తనాలు విత్తారు. తీగజాతి పంటకు అవసరమైన ఏర్పాట్లు, ఎరువులు, పురుగు మందులకు అదనంగా రూ.10 వేలు వెచ్చించారు. మూడు నెలల తర్వాత పంట చేతికి వస్తుండటంతో.. మార్కెట్లో విక్రయిస్తున్నారు. ప్రస్తుతం బీర, కీర రోజువారీగా 60 కేజీల దిగుబడి వస్తోంది. కొద్ది రోజుల్లోనే మిగతా పంటలు చేతికందనున్నాయి. వేసవి మినహా ఆర్నెళ్ల పాటు కూరగాయల సేద్యం చేసి సుమారు రూ.1.40 లక్షల ఆదాయం వచ్చినట్లు నాగేంద్రరావు 'రైతేరాజు'కు తెలిపారు. వాతావరణం అనుకూలించి, మార్కెట్లో ధరలు ఆశించిన స్థాయిలో ఉంటే కూరగాయల సేద్యానికి ఢోకా ఉండదన్నారు.

కూరగాయల తోటలో నాగేంద్రరావు

వరి సాగు వివరాల నమోదు తప్పనిసరి

మానుకోట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం సూచించిన వరి సాగు చేస్తున్న రైతులు తమ సాగు విస్తీర్ణం వివరాలను సెప్టెంబరు 10లోగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని బయ్యారం మండల వ్యవసాయాధికారి రాజు తెలిపారు. తెలంగాణ సోనా(ఆర్‌ఎన్‌ఆర్ 15048), సాంబ మసూరి (బీపీటీ 5204), కేఎన్‌ఎం 1638, హెచ్‌ఎంటీ సోనా, జైశ్రీరామ్, డబ్ల్యూజీఎల్ 44, కేఎన్‌ఎం 7715 రకాల సన్న వరి ధాన్యానికే బోనస్ చెల్లిస్తారు. ఈ ఏడు రకాల విత్తనాలను కొనుగోలు చేసిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, విత్తన కొనుగోలు రసీదుతో సంబంధిత విత్తన డీలర్‌ను సంప్రదించి పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలి. సొంత విత్తనాలు, ఇతర రైతుల నుంచి విత్తనాలు, పరిశోధన కేంద్రాలు, అనుమతించిన ఇతర వనరుల నుంచి విత్తనాలు పొందిన రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారి (ఏఈఓ) వద్ద రైతు ధ్రువీకరణ పత్రం సమర్పించి నమోదు చేసుకోవాలి. నమోదు చేసిన వివరాలను పౌర సరఫరాల శాఖకు అందజేస్తారు. నమోదు చేసుకున్న రైతులే వరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించేందుకు, రూ.500 బోనస్ పొందేందుకు అర్హులవుతారు.

ప్రశ్న - సమాధానం

? వరిలో రెక్కల దోమ ఉధృతి ఎక్కువగా ఉంది. నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి? - **జి.సాంబయ్య, రైతు, వెంకటాపూర్**

✔ ప్రస్తుతం నెల రోజుల వరిలో రెక్కల దోమ ఉధృతి ఎక్కువగా కనిపిస్తే ప్రొఫినోఫాస్ అనే రసాయనాన్ని లీటరు నీటికి 0.5 ఎంఎల్ చొప్పున పిచికారీ చేయాలని వెంకటాపూర్ మండల వ్యవసాయాధికారి శైలజ వివరించారు. – **న్యూస్‌టుడే, వెంకటాపూర్**

గుమ్మడి.. లాభాలు దండి

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: ఏటా ఒకే రకమైన పంటల సాగుతో ఆశించిన ఫలితం ఉండటం లేదని ఓ రైతు వినూత్నంగా ఆలోచించారు. గుమ్మడి సాగు చేస్తూ లాభాలను ఆర్జిస్తున్నారు. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం తమ్మడపల్లి(ఐ)కి చెందిన రైతు బుల్లె బీరయ్య కుటుంబ సభ్యుల సహకారంతో గత ఐదేళ్లుగా గుమ్మడిని సేద్యం చేస్తున్నారు. బీరయ్య తనకున్న 1.30 ఎకరాల విస్తీర్ణంలో గుమ్మడి సాగు చేపట్టారు. పెట్టుబడికి రూ. 50 వేలు వెచ్చించారు. వ్యవసాయ అధికారుల సూచనలతో సస్యరక్షణ చర్యలు చేపట్టారు. నాటిన వంద రోజుల తర్వాత దిగుబడి మొదలైంది. ఎకరానికి ఆరు టన్నుల కాయ వస్తుండగా, కిలోకి రూ.25 చొప్పున విక్రయిస్తున్నారు. ఎకరానికి పెట్టుబడి పోను రూ.80 వేలకు పైగా ఆదాయం సమకూరుతోంది. వివాహాది శుభకార్యాలు, గృహ ప్రవేశాలు, నూతన దుకాణాల ఏర్పాటు, తదితర కార్యక్రమాలకు గుమ్మడి కాయలను వినియోగిస్తుండటంతో.. మంచి లాభాలు వస్తున్నాయని బీరయ్య 'రైతేరాజు'కు తెలిపారు. వరంగల్, హైదరాబాద్, ఖమ్మం, సిరిసిల్ల, యాదాద్రి జిల్లాల్లో ఆర్డర్లపై కాయలను సరఫరా చేస్తున్నామని వివరించారు.

గుమ్మడి చేనులో బి. బీరయ్య

నైపుణ్యమే పెట్టుబడి!

భూపాలపల్లి ఐటీఐ కళాశాలలో వృత్తి శిక్షణలో యువత

● యువతకు 'ఇండియా స్కిల్స్' పోటీలు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: ఏ రంగంలోనైనా రాణించాలంటే ఆ రంగంపై పూర్తి పట్టు, నైపుణ్యం ఉండాల్సిందే. యువతలోని ఈ ప్రతిభను వెలికితీసి ఉపాధి అవకాశాలు పెంచడమే లక్ష్యంగా కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ 'ఇండియా స్కిల్స్ 2026-27' పోటీలను నిర్వహిస్తోంది. చదువుతో సంబంధం లేకుండా కేవలం వయస్సు, నైపుణ్యమే పెట్టుబడిగా ఎవరైనా ఈ పోటీల్లో పాల్గొనవచ్చు.

ఏ అంశాల్లో పోటీలు నిర్వహిస్తారంటే..

త్రీడీ డిజిటల్ గేమ్ ఆర్ట్, ఆటోమొబైల్ టెక్నాలజీ, బేకరీ, బ్యూటీ థెరపీ, కార్ పెయింటింగ్, కార్పెంటర్, క్లౌడ్ కంప్యూటింగ్, కుకింగ్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్స్, ఫ్యాషన్ టెక్నాలజీ, గ్రాఫిక్ డిజైన్, హెల్త్ సోషల్ కేర్, ఇండస్ట్రియల్ మెకానిక్ డిజైన్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, జ్యువెల్లరీ, మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, పెయింటింగ్- డెకొరేటింగ్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ తదితర అంశాలు వ్యక్తిగత విభాగంలో ఉన్నాయి. మొబైల్ రోబోటిక్స్, కాంక్రీట్ కన్‌స్ట్రక్షన్ వర్క్, సైబర్ సెక్యూరిటీ, మెకట్రానిక్స్, రోబోట్ సిస్టమ్స్ ఇంటిగ్రేషన్, తదితర అంశాలు బృందాల వారీగా ఉంటాయి.

● స్కిల్ ఇండియా డిజిటల్ హబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో మొత్తం 63 అంశాలు ఉన్నాయి. వ్యక్తిగత విభాగంలో 56, బృందాల వారీగా ఏడు ఉన్నాయి. పోటీదారులు తాము తయారుచేసిన ప్రాజెక్టులు లేదా నమూనాలను ప్రత్యక్షంగా ప్రదర్శించాల్సి ఉంటుంది. విభాగాల వారీగా కొన్నింటికి 20 ఏళ్లు, మరికొన్నింటికి 23 ఏళ్ల లోపు వయసు ఉన్న యువతీయువకులు ఈ పోటీలకు అర్హులు. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్ ద్వారా www.skillindiadigital.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి సెప్టెంబరు 15 వరకు గడవు ఉంది.

ఈసారి జిల్లాస్థాయి నుంచే..

గతేడాది అభ్యర్థులు తక్కువగా నమోదు చేసుకోవడంతో నేరుగా హైదరాబాద్‌లోనే రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయి. కానీ ఈసారి పోటీదారుల సంఖ్యను బట్టి జిల్లాస్థాయి నుంచే పోటీలు జరపాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో ప్రతిభ చూపిన వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. విజేతలకు పతకాలు, బహుమతులు సైతం అందజేస్తారు.

యువతకు మంచి అవకాశం

యువతకు ఇది చక్కటి అవకాశం. 16 నుంచి 23 ఏళ్లు ఉన్న వారు స్కిల్ ఇండియా నిర్దేశించిన రంగాల్లో నైపుణ్యాలను వెలుగులోకి తేవచ్చు. ఉన్నత స్థాయిలో గుర్తింపు పొందవచ్చు. ఈ మేరకు ముందస్తుగా ప్రతి ఒక్కరు నమోదు చేసుకోవాలి. ఏదైనా సందేహం ఉంటే ప్రభుత్వ ఐటీఐలలో సంప్రదించాలి. – **జూమ్లానాయక్, ఐటీఐ ప్రిన్సిపల్, భూపాలపల్లి**

రేపు పరకాలకు భాజపా రాష్ట్ర అధ్యక్షుడి రాక

పరకాల, న్యూస్‌టుడే: భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు బుధవారం హనుమకొండ జిల్లా పరకాలకు రానున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ తెలిపారు. సోమవారం ఇక్కడి కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు నిరంజన్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబరు 2వ తేదీన జరిగే అమర వీరుల సంస్మరణ దినోత్సవం కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ విజయ్‌కుమార్, పరకాల పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ రాజేందర్‌రెడ్డి, నాయకులు జయంత్ లాల్ మేఘనాథ్ పాల్గొన్నారు.

పరకాలలో మాట్లాడుతున్న సంతోష్‌కుమార్

7లోగా లక్నవరం నీటిని విడుదల చేయాలి

పస్రా (గోవిందరావుపేట), న్యూస్‌టుడే: ఆయకట్టుకు లక్నవరం జలాశయం నుంచి సెప్టెంబరు 7వ తేదీలోగా నీరు విడుదల చేయాలని రైతు కమిటీ ప్రతినిధులు తుమ్మల వెంకట్‌రెడ్డి, గొల్యాల నర్సిరెడ్డి, మాచినేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని లక్నవరం జలాశయం ఆయకట్టు రైతులు సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సమావేశమయ్యారు. 53 మందితో కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం ప్రతినిధులు మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావం కారణంగా ఇప్పటి వరకు సరైన వర్షాలు లేకపోవడంతో పంటలు పూర్తిస్థాయిలో సాగు చేసుకోలేని పరిస్థితి ఉందని, లక్నవరం జలాశయం కింద వేల ఎకరాల్లో వరినాట్ల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 60 శాతం నాట్లే పడ్డాయని, నీళ్లులేక అవికూడా ఎండిపోతున్నాయని చెప్పారు. ఆగస్టు 18న రైతు నాయకులతో సమావేశమైన కలెక్టర్ హేమంత్ బోర్ఖడే పరిస్థితి తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటి వరకు విడుదల చేయలేదన్నారు. నీటి పారుదల శాఖ అధికారులు స్పందించకుంటే సెప్టెంబరు 10న జాతీయ రహదారిని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. సమావేశంలో రైతు కమిటీ ప్రతినిధులు బి.దేవా నాయక్, జి.శ్రీనివాసరావు, వి.స్వామి, బి.మధు, బి.అశోక్, జి.రామస్వామి, ఎన్.సతీశ్, సీహెచ్. లింగారెడ్డి, టి.ఆగిరెడ్డి, ఎస్.సమ్మిరెడ్డి ఎం.సతీశ్, ఎం.తేజరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ సమాచారం

✦ భద్రకాళి ఆలయంలో మంగళవారం ఉదయం 5.30 గంటలకు అమ్మవారికి అభిషేకం, శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకం ఉంటుంది. ఉదయం 9 గంటల నుంచి మహా మండపంలో విశిష్ట కుంకుమార్చనలు జరుగుతాయి. ఉదయం 7 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సర్వ దర్శనాలు ఉంటాయి.

✦ హనుమకొండ వేయిస్తంభాల ఆలయంలో మంగళవారం ఉదయం 5.30 గంటల నుంచి సామూహిక రుద్రాభిషేకాలు జరుగుతాయి. శ్రావణమాసం ప్రత్యేక పూజలు ఉంటాయి. ఉదయం 6 గంటల నుంచి అర్చనలు. ఉదయం 7 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సర్వ దర్శనాలు ఉంటాయి.

✦ హనుమకొండలోని చారిత్రక హనుమద్గిరి పద్మాక్షి దేవాలయంలో మంగళవారం ఉదయం 5:00 గంటలకు ప్రధాన దేవతామూర్తికి అభిషేకం ఉంటుంది. ఉదయం 7:00 గంటల వరకు మహా మంగళహారతి, 7:15 గంటల నుంచి కుంకుమార్చన, పుష్పార్చన నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12:30 గంటల వరకు భక్తులకు సర్వ దర్శనాలుంటాయి. సాయంత్రం 4 గంటల నుంచి 6:30 గంటల వరకు సర్వదర్శనం ఉంటుంది.

✦ కాళేశ్వర క్షేత్ర ఆదిముక్తీశ్వర బాలాలయంలో మంగళవారం ఉదయం 5.30 గంటలకు ద్విలింగాలకు మహాన్యాస రుద్రాభిషేకం, ఉదయం 8 నుంచి సామూహిక కాలసర్ప దోష నివారణ, రాహువు కేతువు పూజలు, రూ.వెయ్యితో ప్రత్యేక అభిషేకాలు, 10.30 గంటలకు శుభానంద, ముక్తీశ్వర స్వామికి నిత్య కల్యాణం, రాత్రి 7 నుంచి జ్ఞాన సరస్వతీ ఘాట్ వద్ద కాళేశ్వరం అర్చకుల త్రిహారతి, రాత్రి 8 గంటలకు ఆలయ ద్వార బంధనం. – న్యూస్‌టుడే, రంగంపేట, వరంగల్ సాంస్కృతికం, కాళేశ్వరం

ములుకనూర్ డెయిరీ పాల సేకరణ ధరల పెంపు

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: ములుకనూర్ మహిళా సహకార డెయిరీ సభ్యులు పాడి పశుపోషణపై ఆధారపడి పాల ఉత్పత్తిని పెంచుకొని ప్రధాన ఆర్థిక వనరుగా మార్చుకున్నారు. పాల ఉత్పత్తి పెరగడంతో మార్కెట్‌లో ఉన్న పోటీని దృష్టిలో పెట్టుకుని పాల సేకరణ ధరలను మంగళవారం నుంచి పెంచుతున్నట్లు డెయిరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ, జీఎం మార్పాటి భాస్కర్‌రెడ్డి సోమవారం తెలిపారు. పెంచిన ధరలు లీటర్ ఆవు పాలు కనిష్ఠంగా 3 శాతం వెన్నకు రూ.37.38, గరిష్ఠంగా 4.9 శాతం వెన్న కలిగిన పాలకు రూ.43.55 ధర నిర్ణయించినట్లు పేర్కొన్నారు. గేదె పాలకు కనిష్ఠంగా 5 శాతం వెన్న పాలకు రూ.44.50, గరిష్ఠంగా 15 శాతం వెన్న కలిగిన పాలకు రూ.133.50గా నిర్ణయించామన్నారు. సగటున ఆవు పాలకు రూ.1.25, గేదె పాలకు రూ.3.50 పెరిగిందన్నారు. ఈ ధరలు సెప్టెంబరు 1న ఉదయం నుంచి అమలులో ఉంటాయన్నారు. అలాగే పాల వ్యాపారంలో వచ్చిన లాభాలను సైతం సభ్యులకు బోనస్ రూపంలో పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. 50 కిలోల దాణా బస్తాకు రూ.125 రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. పశుగ్రాసం విత్తనాలు 50 శాతం రాయితీ, పశువుల మందులు 25 శాతం రాయితీతోపాటు పాడి పశువులకు బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. డెయిరీ సభ్యుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సభ్యురాలు, ఆమె భర్త ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.75 వేలు, సహజ మరణానికి రూ.35 వేలు బీమా సదుపాయంతోపాటు అంత్యక్రియలకు రూ.7,500 చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు.

'ప్రతిపక్ష పార్టీల నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు'

నయీంనగర్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటే, ప్రతిపక్ష భారాస, భాజపా నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం హనుమకొండ కాంగ్రెస్ భవన్‌లో టీపీసీసీ నేత బత్తిని శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులను మోసం చేసింది భారాస ప్రభుత్వమేనని, వారిపట్ల మొసలి కన్నీరు కార్చడం సరికాదన్నారు. ఉద్యోగులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం తెచ్చింది కాంగ్రెస్ అని, అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు ఉపకార వేతనాలు, రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తున్నామని, గత ప్రభుత్వమే బకాయిలు చెల్లించలేదని విద్యార్థులు గమనించాలన్నారు. ఓరుగల్లు సమగ్ర అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. భాజపా ఓరుగల్లుకు చేసింది శూన్యమని అన్నారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, విమానాశ్రయం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ఆధునిక బస్టాండ్ నిర్మాణానికి పాటుపడుతోంటే అడ్డుకుంటున్నారని తెలిపారు. బండి సంజయ్ కుటుంబానికి రాజకీయ భిక్ష పెట్టింది కాంగ్రెసేనని, కేసీఆర్, చంద్రబాబు కాంగ్రెస్ నుంచి వచ్చినవారేనని గుర్తు చేశారు. అర్వింద్ ఓరుగల్లుకు వస్తే గుండు గీయించడం తప్పదన్నారు. పదేళ్లలో భారాస చేసిన అభివృద్ధి, రెండున్నరేళ్లలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నారని, రాబోవు కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలకు గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు పోతుల శ్రీమాన్, జక్కుల రవీందర్, మామిండ్ల రాజు, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సరళా, నాయకులు డా.రామకృష్ణ మార్క విజయ్‌గౌడ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, టీపీసీసీ నేతలు బత్తిని శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి

త్రినగరి

సేంద్రియ సాగును ప్రోత్సహించాలి

రంగశాయిపేట, న్యూస్‌టుడే: సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించి రసాయన రహిత పంటలను పండించాలని కర్ణాటక రాష్ట్ర యునైటెడ్ నేషన్స్ రిసోర్స్ సెంటర్ కో-ఆర్డినేటర్ బ్లెస్సినా డేనియల్ జోసెఫ్ సూచించారు. సోమవారం శంభునిపేట పీపుల్స్ మీడియేషన్ సెంటర్‌లో యునైటెడ్ నేషన్స్ తెలంగాణ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా బ్లెస్సినా డేనియల్ జోసెఫ్ హాజరై మాట్లాడారు. కో-ఆర్డినేటర్ ధర్మపురి రాజగోవిందు, మండల పర్శరాములు, డా.బాల్నే సాంబమూర్తి, వడ్నాల నరేందర్, డా.కృష్ణారావు, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్క నాటుతున్న బ్లెస్సినా డేనియల్ జోసెఫ్

జాతీయస్థాయి పోటీలకు 'లక్ష్య' అథ్లెట్లు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఈనాడు 'లక్ష్య' అథ్లెట్లు ఎంపికయ్యారు. 21వ యూత్ నేషనల్స్ పంజాబ్ రాష్ట్రంలోని లుధియానాలోని గురునానక్ స్టేడియంలో సెప్టెంబరు 1 నుంచి 3వ తేదీ వరకు పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు అండర్-18 విభాగంలో అమూల్య, స్ఫూర్తి 3000 మీటర్ల రేస్‌వాక్, బన్నీ 110 మీటర్ల హర్డిల్స్ పరుగులో బరిలోకి దిగనున్నారు. హనుమకొండలోని 'లక్ష్య' కేంద్రంలో కోచ్ తిరుపతి వద్ద శిక్షణ పొందుతున్నారు. యూత్ నేషనల్స్‌లో పాల్గొనే తెలంగాణ అథ్లెటిక్స్ టీంకు తిరుపతి మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు. జాతీయ పోటీలకు ఎంపికైన ఈనాడు 'లక్ష్య' అథ్లెట్లను డీవైఎస్‌వో ప్రశాంత్, రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి సోమవారం అభినందించారు.

ఎంపికైన అథ్లెట్లతో కోచ్ తిరుపతి

2న పెద్ది సుదర్శన్‌రెడ్డి యాది సభ

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే: పూర్వ ఐకాస ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుడు, దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డి యాది సభను ఈ నెల 2న హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించనున్నారు. ఈమేరకు సోమవారం హనుమకొండలోని ప్రెస్ క్లబ్‌లో పూర్వ ఐకాస నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సభకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ఐకాస సంఘాల ప్రతినిధులు కార్మిక, కర్షక, ప్రజా సంఘాల నాయకులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఐకాస నాయకులు మర్రి యాదవరెడ్డి, మాలోతు భిక్షపతి, సరోత్తంరెడ్డి, దినేశ్‌కుమార్, యాదగిరిరెడ్డి, రాజేష్, వెంకటరాములు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	122
రిటైల్:	149
డ్రెస్డ్:	231
స్కిన్‌లెస్:	261

EENADU Classifieds

REAL ESTATE

LAND FOR SALE

జనగాం-హుస్నాబాద్ హైవే దగ్గరలో 1.35 ఎకరం ఎర్ర నేల తూర్పు ఫేసింగ్‌తో 600ft పొడవు 150ft వెడల్పుతో బోర్ &జాలీ ఫెన్సింగ్‌తో అమ్మబడును.పౌల్ట్రీ ఫామ్స్/ ఏ ఫామ్ కైనా/ఏ తోటకైనా అనుకూలం. ✆ 8019095973.

JOBS

Wanted Car Driver and Ward boys for Balaji Hospital, Opp Ram Laxman Theater, SVN Road, Warangal. Contact 9502455663, 7989844760.

రాఘవ ఆటో ఫైనాన్షియర్స్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను NSPT-2, WGL-6, JNGM-4, TRR-2, MHBD-4 సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ JNGM-1, TRR-1 ✆ 9100902190, 9100902189.

ప్రముఖ కొరియర్ సంస్థ డెలివరి లిమిటెడ్ హన్మకొండలో పనిచేయుటకు డెలివరి బాయ్స్ కావలెను జీతం 20,000-30,000 ✆6301945121,9989731552.

వరంగల్ టౌన్‌లో పని కలదు. కరుంగళి & అయ్యప్ప మాలలు మీ ఇంటివద్దనే తయారుచేసి ఇవ్వగలవారికి నేర్పించి పని ఇవ్వబడును. వీక్లీ పేమెంట్. ✆9391340755

FACULTY/ TEACHERS

Wanted P.E.T for a high school near Alankar, HNK. Ph: 9618130671, 7702994750

నవోదయ కోచింగ్ సెంటర్‌లో పనిచేయుటకు లేడి వార్డెన్, అనుభవం గల మాథ్స్ ఫ్యాకల్టీ కావలెను. సంప్ర: భీమారం, HNK # 9963203554.

TO BOOK YOUR CLASSIFIED 5 lines Advt. B/W Rs. 430/- Colour Rs. 495/- only ★ GST 5% అదనం For Advertisement Enquiry Please Contact to 80080 01791 80086 95558 80085 59193

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

పోక్సో కేసు.. 20 ఏళ్ల జైలుశిక్ష

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధికా జైశ్వాల్ సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ మహేష్ బి.గితె తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 2021లో తంగళ్లపల్లి ఠాణా పరిధిలోని ఓ బాలికపై జనగామకు చెందిన యటెల్లి విజయ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై లక్ష్మారెడ్డి కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కోర్టులో కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి.. నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష, జరిమానా విధించినట్లు తెలిపారు. మహిళల భద్రతకు పోలీస్ శాఖ ప్రాధాన్యం ఇస్తోందని, ఎవరైనా వేధింపులకు గురైతే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేశ్

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: ఎనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో గతవారం దొంగతనానికి పాల్పడిన ఇద్దరిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఆరెపల్లికి చెందిన ఎదులాపురం మంజు స్థానికంగా కిరాణ దుకాణం నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గత సోమవారం ఇంటికి తాళం వేసి కుమారుడితో కలిసి దుకాణం వద్దే నిద్రించారు. మరుసటి రోజు ఇంటికి వెళ్లేసరి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలోని 15 గ్రాముల బంగారు నల్లపూసల గొలుసు, రూ.10వేల నగదు కనిపించకపోవడంతో ఎనుమాముల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం బాలాజీనగర్ జంక్షన్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా.. ఆటోలో వెళుతున్న వరంగల్ ఎంహెచ్ నగర్‌కు చెందిన ఊరడి అభిలాశ్, ఇసంపెల్లి లోకేశ్ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా.. నల్లపూసల గొలుసు లభించింది. తాగుడుకి బానిసై జల్సాలకు అలవాటుపడి దొంతనానికి పాల్పడినట్లు అంగీకరించారు. బంగారం, నగదు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

జర్మనీ యూనివర్సిటీతో కేయూ ఒప్పందం

కేయూ సర్కిల్, న్యూస్‌టుడే: కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా జర్మనీ పర్యటనలో భాగంగా అక్కడి రూట్లింగెన్ యూనివర్సిటీతో కాకతీయ యూనివర్సిటీ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో అవగాహన ఒప్పంద పత్రాల మార్చుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ఆచార్య కుమార్ సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. జర్మనీలోని రూట్లింగెన్ యూనివర్సిటీకి చెందిన ఆచార్య బ్రూనే జోచెన్, స్టెఫాన్ డెగ్లెమాన్ ఆన్‌లైన్ ద్వారా కార్యక్రమంలో పాల్గొనగా, అవగాహన ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. ఇందులో భాగంగా కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు 3ప్లస్2 మాస్టర్స్ కోర్సు ద్వారా తమ ఉన్నత విద్యను జర్మనీలో కొనసాగించే అవకాశం పొందనున్నారు. ఇందులో మొదటి మూడేళ్ల విద్యను కేయూలో పూర్తి చేసి తర్వాత రెండేళ్ల మాస్టర్స్‌ను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ అనంతరం రూట్లింగెన్ యూనివర్సిటీ మాస్టర్స్ డిగ్రీ ప్రదానం చేస్తుంది. ఈ కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం, ఓఎస్డీ వెంకట్రాంరెడ్డి, రూసా నోడల్ అధికారి ఆచార్య మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

జర్మనీ ప్రతినిధులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంటున్న కేయూ వీసీ

జనగణనలో ఓబీసీలకు ప్రత్యేక కోడ్ ఇవ్వాలి

జులైవాడ, న్యూస్‌టుడే: జనగణన శాస్త్రీయంగా, పారదర్శకంగా నిర్వహించాలని బీసీ ఉద్యమ నాయకుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ డిమాండు చేశారు. సోమవారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణనలో ఓబీసీలకు ప్రత్యేక స్థానం ఇవ్వాలన్నారు. కేంద్రం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లోని ప్రశ్న నంబరు 10ని సవరించాలన్నారు. ప్రతి కులానికి ప్రత్యేక కోడ్ శాస్త్రీయ డ్రాప్‌డౌన్ విధానం అమలు చేయాలన్నారు. జనగణనతోపాటు కులగణన చేపట్టాలన్న కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విద్యాసాగర్, మియాపురం శివుడు, చంద్రమౌళీ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పరికిపండ్ల అశోక్

వసతి గృహ బియ్యం పక్కదారి?

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: హనుమకొండ బాలసముద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు అందించాల్సిన బియ్యాన్ని ఆదివారం రాత్రి అక్రమంగా ఆటోలో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. ఈ బియ్యాన్ని స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. వసతి గృహ విద్యార్థినులకు చెందిన బియ్యాన్ని బయటకు ఎందుకు తరలిస్తున్నారు. ఎవరి ఆదేశాలతో తరలించారు. .. ఎంత మొత్తంలో తరలించారనే అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ ఘటనపై జిల్లా ఎస్సీ సంక్షేమాధికారిణి నిర్మల సోమవారం వసతి గృహాన్ని సందర్శించి వివరాలు సేకరించి విచారణ చేపట్టినట్లు తెలిసింది. అనంతరం కలెక్టర్‌కు నివేదిక అందించి బాధ్యులపై చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

(c) eenadu

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కేసముద్రంలో 33/11 కేవీ విద్యుత్తు ఉపకేంద్రాన్ని ప్రారంభించిన మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, చిత్రంలో మహబూబాబాద్, డోర్నకల్ ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, రామచంద్రునాయక్, జిల్లా, స్థానిక నాయకులు

కేసముద్రం (ఇనుగుర్తి), న్యూస్‌టుడే: పేద ప్రజల సంక్షేమం కోసమే రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం పని చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలో సోమవారం మంత్రి సీతక్క, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డిలతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ముందుగా కేసముద్రం విలేజీలో రూ.1.90 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్తు ఉపకేంద్రాన్ని ప్రారంభించారు. కేసముద్రంలో రూ.6.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న పురపాలక సంఘ కార్యాలయ భవనం, ఇనుగుర్తి, దంతాలపల్లి, సీరోలులో రూ.6.75 కోట్ల వ్యయంతో నిర్మించనున్న తహసీల్దారు కార్యాలయాల భవనాల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కేసముద్రం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన రైతులకు భూ ఆధార్ పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న నారాయణపురం రైతుల వ్యవసాయ భూములను గత ప్రభుత్వం ధరణి పోర్టల్‌లో అటవీభూములుగా చూపడంతో పట్టాలు కోల్పోయారన్నారు. దీంతో రైతులకు ఎనిమిదేళ్లుగా రైతు భరోసా, రైతుబీమా, రైతు రుణాలు అందక పలు పోరాటాలు చేశారన్నారు. వెయ్యి రోజుల్లో ఏమి చేశారని ప్రతిపక్ష పార్టీ అంటోందని.. వారు పదేళ్లలో చేయని పనులను తమ ప్రభుత్వం వెయ్యి రోజుల్లోనే అమలు చేసి చూపిందన్నారు. కార్యక్రమంలో ఎంపీ బలరాం నాయక్, ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు భూక్యా మురళీనాయక్, కె.ఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణ, కలెక్టర్ స్నేహశబరీష్, ఎస్పీ శబరీష్, డీఎస్.లోకేష్‌కుమార్, రాజీవ్‌గాంధీ హనుమంతు, కేసముద్రం మార్కెట్ కమిటీ అధ్యక్షుడు గంట సంజీవరెడ్డి, పురపాలక సంఘ అధ్యక్షురాలు బానోత్ సునీత తదితరులున్నారు.

రైతులకు సాగునీరు అందిస్తాం

సోలిపురంలో మహిళ భవనానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

తరిగొప్పుల, న్యూస్‌టుడే: లిఫ్టు ఇరిగేషన్ పనులు త్వరగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలో బొంతగట్టునాగారం, బొత్తలపర్రె, జాలుబాయితండా, వాచ్యతండ, కొత్త తండా, అంకుషాపురం, సోలిపురం, అక్కరాజుపల్లి గ్రామాల్లో పర్యటించి మహిళ సంఘాల భవనాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.... ప్రతి గ్రామానికి సాగు నీరు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు కుర్రె మల్లయ్య, రవి, అల్బుతి, లలిత, రమ, శ్రీనివాస్, రాజు, సమ్మయ్య పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా
జనగామ: 80085 74872
జనగామ అర్బన్:80749 20132
పాలకుర్తి: 99638 63862
స్టేషన్‌ఘన్‌పూర్: 90521 83243
జఫర్‌గఢ్: 98662 50618
(10 AM TO 1 PM)

పిచ్చిమొక్కల తొలగింపు

నర్మెట్ట, న్యూస్‌టుడే: నర్మెట్ట నుంచి వెల్దండకు వెళ్లే ప్రధాన రహదారి ఊర చెరువు సమీపంలో విద్యుత్తు నియంత్రిక చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్ల చెట్లు ఏపుగా పెరగడంతో అది కనిపించడం లేదు. అసలే వర్షాకాలం కావడంతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉండటంతో సోమవారం ఈనాడులో 'సారూ..నియంత్రిక ఉందిక్కడ' శీర్షిక కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్తు అధికారులు సిబ్బందితో నియంత్రిక చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు.

ఆపద వేళ అండగా ఉంటాం

సంతోషికి ఎల్ఓసీ అందజేస్తున్న ఎంపీ కావ్య

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజలకు ఆపద వేళ అండగా ఉంటామని ఎంపీ, కడియం కావ్య అన్నారు. మండలంలోని నమలిగొండ గ్రామానికి చెందిన సంతోషి అనారోగ్యంతో బాధపడుతున్నారు. నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎంపీ బాధితురాలికి మెరుగైన వైద్యం కోసం రూ.2,50,000 విలువ చేసే ప్రధాన మంత్రి సహాయనిధి ఎల్ఓసీని సోమవారం తన నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రజాక్‌యాదవ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నర్మెట్ట, న్యూస్‌టుడే: గుంటూరుపల్లి గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ ఏరువ బాలరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందాడు. సోమవారం ఉదయం శ్రీ వీరాంజనేయ మినీ గూడ్స్ యూనియన్ సభ్యులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.15వేల ఆర్థికసాయం అందజేశారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

పాలకుర్తిలో లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి(జనగామఅర్బన్), న్యూస్‌టుడే: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. పాలకుర్తి నియోజకవర్గంలోని 262 మంది లబ్ధిదారులకు రూ.1.05 కోట్ల విలువైన చెక్కులను అందజేశారు. ఆమె మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలు అనారోగ్య చికిత్సల కోసం అప్పుల పాలవ్వకుండా బాధితులను ఆదుకునేందుకు సీఎం సహాయనిధి తోడ్పడుతుందన్నారు. నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ పథకాలు చేరేలా కృషిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు భిక్ష కాదు... హక్కు

దీక్షలో కూర్చున్న భాజపా, బీజేవైఎం నాయకులు

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజురీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాలు ప్రభుత్వ భిక్ష కాదని, రాజ్యాంగం కల్పించిన హక్కు అని భాజపా జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ అన్నారు. ఫీజుల బకాయి భాజపా లడాయి కార్యక్రమంలో భాగంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎల్లబోయిన హరీశ్ అధ్యక్షతన స్థానిక చౌరస్తాలో ఫీజు దీక్ష జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగిస్తూ పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ , ఉపకారవేతనాలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను విడుదల చేయాలని కోరారు. లేకపోతే రాబోయే రోజుల్లో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉడుగుల రమేశ్, సంతోశ్, ఉమారాణి, అంజిరెడ్డి, అనిల్, అఖిల్, పాల్గొన్నారు.

ఎంపీడీవో సేవలు అభినందనీయం

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: రెండున్నర ఏళ్లపాటు మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాల అమలులో ఎంపీడీవో గార్లపాటి శ్రీనివాస్ సేవలందించారని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాంబాబు, జడ్పీ సీఈవో భాస్కర్, జిల్లా పంచాయతీ అధికారి వెంకట్ రెడ్డి అన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్ పదవీ విరమణ సందర్భంగా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్తు సిబ్బంది సోమవారం సన్మాన సభ ఏర్పాటు చేసి ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నూతన ఎంపీడీవో శ్రీనివాసన్ కావ్య, జగదీశ్ చందర్ రెడ్డి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల ప్రతినిధులు అంజమ్మ, పాల్గొన్నారు.

మండల స్థాయి పాఠశాల క్రీడా ఎంపికలు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, న్యూస్‌టుడే: స్టేషన్‌ఘన్‌పూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ నెల 2,3వ తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా ఎంపికలు నిర్వహించనున్నామని ఎంఈవో కొమురయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 14, 17 ఏళ్ల విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాల్లో ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. క్రీడాకారులు ఒరిజినల్ బోనఫైడ్(పీఈఎన్ సంఖ్య నమోదై ఉండాలి), ఒరిజినల్ ఆధార్ కార్డు సమర్పించాలని కోరారు. ఎస్‌జీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు రవి, చంద్రశేఖర్‌రెడ్డిలున్నారు.

పట్టణ సమస్యల పరిష్కారానికి డిమాండ్

కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

జనగామ, న్యూస్‌టుడే: పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో పౌర సేవలను మెరుగుపర్చాలని, ప్రజారోగ్యాన్ని కాపాడాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం జరిగిన కార్యక్రమంలో పార్టీ పట్టణ కమిటీ సభ్యుడు బి.వెంకటమల్లయ్య అధ్యక్షత వహించగా, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ మాట్లాడారు. స్థానిక ఆర్వోబీ పరిరక్షణ, స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కె.లింగం, పి.లలిత, ఎండీ గౌసియా, డి.అబ్రహంలింకన్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను సోమవారం మిల్స్‌కాలనీ పోలీసులు సీజ్ చేశారు. వర్ధన్నపేట ఆకేరు వాగు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా వరంగల్- ఖమ్మం జాతీయ రహదారి మీదుగా నగరానికి ఇసుక తీసుకొస్తున్న ట్రాక్టర్లను పెట్రోలింగ్ పోలీసులు అదుపులోకి తీసుకొని చోదకులపై కేసు నమోదు చేశారు.

ఫాదర్ కొలంబో ఆశయాలను కొనసాగిద్దాం

సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ వినయ్‌కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్, స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, న్యూస్‌టుడే: స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలో ఫాదర్ కొలంబో వర్ధంతి వేడుకలను సోమవారం భారాస ఆధ్వర్యంలో నాయకులు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య హాజరై ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణంలో ఫాదర్ కొలంబో ఆశయాలను కొనసాగిద్దామని మున్సిపల్ ఛైర్మన్ వినయ్‌కుమార్ అన్నారు. సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫాదర్ కొలంబో వర్ధంతి సందర్భంగా పేదలకు ఫలాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

భూములను రక్షించడంలో అధికారుల నిర్లక్ష్యం

ప్రజావాణిలో వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ కార్యకర్తలు

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: మండలంలో పలు గ్రామాల్లో ప్రభుత్వ, రెవెన్యూ భూములు అక్రమాలకు గురవుతున్నాయని.. తాము అనేక మార్లు వినతి పత్రాలు అందజేసిన రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని సీపీఐ మండల కార్యదర్శి రమేశ్ అన్నారు. సోమవారం జఫర్‌గఢ్ మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదికలో అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ, రెవెన్యూ భూములను కాపాడటంలో ఇక్కడి అధికారులు విఫలమైనారని విమర్శించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు యాకుబ్‌పాషా, పార్టీ నాయకులు సుధాకర్, పెద్దరాములు, యాదగిరి, రాములు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను అమలులో పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని భారాస పార్టీ కార్యాలయంలో బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే నిరసన కార్యక్రమాలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జీసీడీఓపై చర్యలు తీసుకోవాలని వినతి

జనగామ రూరల్, న్యూస్‌టుడే: విద్యార్థి పర్యావరణ పోటీల పట్ల నిర్లక్ష్యంగా, అలసత్వం ప్రదర్శిస్తున్న జీసీడీఓ గౌసియాబేగంపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) యూత్ ఆధ్వర్యంలో ఎంపీడీవో మహేశ్‌నాయక్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. విద్యార్థులతో నిర్వహించడం వల్ల పర్యావరణ పరిరక్షణపై వారికి అవగాహన ఏర్పడుతుందని..ఇందుకు విరుద్ధంగా ఉపాధ్యాయులతో నిర్వహించడం వల్ల నష్టాలు జరుగుతున్నాయని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చెన్నూరు వంశీ, విజయ్, గంగరాజు, మంద సాయికిరణ్, పాల్గొన్నారు.

రైతుల నమోదు తప్పనిసరి

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, న్యూస్‌టుడే: సన్నరకం వరి సాగు చేసిన రైతులు ఈ నెల 10వ తేదీలోపు వ్యవసాయశాఖాధికారుల వద్ద తమ పేర్లు తప్పని సరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి కరుణాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఎంపికచేసిన ఏడు సన్న రకం వరి రకాలు సాగు చేసిన రైతులకు బోనస్ వర్తిస్తుందన్నారు.

అథ్లెటిక్స్‌లో జిల్లాకు పసిడి పతకాలు

పతకాలు సాధించిన అథ్లెటలతో కోచ్ రంజిత్‌కుమార్

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి సౌత్‌జోన్ అథ్లెటిక్స్ మీట్‌లో జిల్లా అథ్లెట్లు రెండు బంగారు, రెండు రజత, ఒక కాంస్య పతకం సాధించినట్లు ఈనాడు లక్ష్య కోచ్ తూడి రంజిత్‌కుమార్ తెలిపారు. బాలుర 20 సంవత్సరాల షార్ట్ పుట్, హ్యామర్‌త్రో విభాగంలో జి.సునీత్‌కుమార్, బాలికల విభాగంలో ఎం.అక్షయసింధు బంగారు, రజత పతకాలు సాధించగా, 16 సంవత్సరాల బాలికల షాట్‌పుట్ విభాగంలో సమన్విత కాంస్య పతకం సాధించినట్లు పేర్కొన్నారు. పతకాలను సాధించిన జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణగౌడ్, కార్యదర్శి గంగిశెట్టి మనోజ్‌కుమార్ అభినందించారు.

వ్యక్తిత్వ వికాసంపై రేపు అవగాహన

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, మాదకద్రవ్యాల పట్ల అవగాహన కల్పించడమే లక్ష్యంగా 'వ్యక్తిత్వ వికాస' ప్రత్యక్ష శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సేవాలాల్ సేన జిల్లా కమిటీ నాయకులు తెలిపారు. అందుకు సంబంధించిన కరపత్రాలను సోమవారం స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ. బుధవారం జిల్లా కేంద్రంలోని సాయిరాం వేడుకల మందిరంలో నిర్వహించనున్న సంస్కృతి విలువలు- వ్యక్తిత్వ వికాసం శిక్షణలో ప్రముఖ సైకాలజిస్ట్ డా.లక్ష్మణ్‌నాయక్ అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా బాధ్యులు ధరావత్ శంకర్‌నాయక్, రమేశ్, మోహన్, అనిల్, పాల్గొన్నారు.

బస్ స్టేషన్‌లో ప్రయాణికుల నిరసన

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ నుంచి మరిగడికి వెళ్లే బస్సు సాయంత్రం నుంచి రాత్రి వరకు రాకపోవడంతో ఇబ్బందిగా ఉందంటూ అటువైపుగా వెళ్లే పలు గ్రామాల ప్రయాణికులు సోమవారం రాత్రి బస్టాండ్ ఇన్‌గేట్ ఎదుట బైఠాయించారు. సాయంత్రం 5 గంటలకు రావాల్సిన మరిగడి బస్సు రాత్రి 8.30 అవుతున్నా రాలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళన వద్దకు చేరుకున్న ట్రాఫిక్ పోలీసులు వారితో ఆర్టీసీ అధికారులతో మాట్లాడిస్తామని నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. నిరసనలో పలు గ్రామాల ప్రయాణికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారిలో రఘునాథపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందారు. ఎస్సై డి. నరేశ్ కథనం ప్రకారం.. సంచార జీవనం సాగిస్తూ.. బయటి కమ్మరి పనులు చేస్తున్న ఈరాపురం యాదగిరి, వెంకటమ్మ (50) దంపతులు వెల్ది రోడ్డులో గుడిసె వేసుకుని తాత్కాలికంగా నివాసముంటున్నారు. ఆదివారం అర్ధరాత్రి దంపతులిద్దరు నిడిగొండ నుంచి జాతీయ రహదారి మీదుగా రఘునాథపల్లికి వెళ్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్తున్న మినీ వ్యాను వెంకటమ్మను ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను జనగామ జనరల్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఎంజీఎంకు తరలించి, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. మృతురాలి కుటుంబ సభ్యులిచ్చిన ఫిర్యాదు మేరకు వ్యాన్ డ్రైవర్ ప్రవీణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

కార్డులను అందజేస్తున్న సర్పంచి రామకృష్ణ

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: మండలంలోని నెల్లుట్ల, సిరిపురం, కళ్లెం గ్రామాల్లో సర్పంచులు రామకృష్ణ, సంపత్, శోభ సోమవారం స్మార్ట్ రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమ కోసం పథకాలను అమలు చేస్తుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపసర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

డీసీపీకి సన్మానం

డీసీపీని సన్మానిస్తున్న కవులు

జనగామ టౌన్, న్యూస్‌టుడే: ఇటీవల ఐపీఎస్ హోదా పొందిన వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్‌ను జనగామ కవులు, కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం డీసీపీని కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కవులు, కళాకారులు జి.కృష్ణ, రవీందర్‌రావు, నారగోని మూర్తి, మురళి పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవించిన మహిళ

చిల్పూర్, న్యూస్‌టుడే: మండలంలోని లింగంపల్లి గ్రామ శివారు దేవోజీతండాకు చెందిన మంజుల అనే మహిళకు సోమవారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో సిబ్బంది వాహనంలోనే ప్రసవం చేశారు. అనంతరం తల్లి, బిడ్డను హనుమకొండలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం తల్లి, బిడ్డ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లుగా సిబ్బంది తెలిపారు.

రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగుల కమిటీ ఎన్నిక

జనగామ టౌన్, న్యూస్‌టుడే: రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగుల జిల్లా నూతన కమిటీని సోమవారం జనగామలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నల్ల రమేష్, ఉపాధ్యక్షులుగా మేకల నాగరాజు, తాళ్లపల్లి చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శిగా తాట మహేశ్వరి, కోశాధికారిగా చింతకింది రాంప్రసాద్, సహాయ కార్యదర్శిగా నస్కూరి శ్రీను, గౌరవ సలహాదారులుగా లక్ష్మారెడ్డి, కిరణ్‌కుమార్, రవీందర్, పరశురాములు ఎన్నికయ్యారు.

కమిషనరేట్‌లో పోలీసు అధికారుల బదిలీలు

వరంగల్ క్రైం (హనుమకొండ), న్యూస్‌టుడే: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న పలువురు అధికారులను బదిలీ చేస్తూ సీపీ ఎన్.శ్వేత సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ
ఎస్. శ్రీనివాస్	వీఆర్, వరంగల్	స్టేషన్‌ఘన్‌పూర్
జి. వేణు	స్టేషన్‌ఘన్‌పూర్	రఘునాథ్‌పల్లి (సీఐ)
ఎ. శ్రీనివాస్	రఘునాథ్‌పల్లి	ఎస్‌బీ, వరంగల్
పి. దేవేందర్	టాస్క్‌ఫోర్స్	నర్మెట్ట (సీఐ)
టి. రవికుమార్	సీపీటీసీ	మహిళా ఠాణా-2
ఎ. సువర్ణ	మహిళా ఠాణా-2	సీసీఎస్
పి. మంగీలాల్	టాస్క్‌ఫోర్స్	మిల్స్ కాలనీ అటాచ్
భరత్ సుమన్	వరంగల్ పోలీసు కమిషనరేట్	పాలకుర్తి (సీఐ)
వి. జానకీరాం రెడ్డి	పాలకుర్తి (సీఐ)	ఎస్‌బీ, వరంగల్
టి. కిరణ్	వరంగల్ పోలీసు కమిషనరేట్	పీసీఆర్, వరంగల్ అటాచ్డ్ ఐటీ కోర్
ఎ. ప్రవీణ్‌కుమార్	ఐటీ కోర్	పరకాల
వి. క్రాంతికుమార్	పరకాల	టాస్క్‌ఫోర్స్
జి. బాబులాల్	టాస్క్‌ఫోర్స్	ఆత్మకూరు
బి. రాజ్‌గోపాల్	పర్వతగిరి (సీఐ)	టాస్క్‌ఫోర్స్
కె. శ్రీను	వీఆర్, వరంగల్	ఎల్కతుర్తి (సీఐ)
పి. రమేష్	ఎల్కతుర్తి	మహిళా ఠాణా-1
కె. సూర్యప్రసాద్	మహిళా ఠాణా-1	సీటీసీ, వరంగల్
కె. సాయిరమణ	వీఆర్	ఎస్‌బీ, డ్రగ్ కంట్రోల్ టీం
వై. సంజీవరావు	సీసీఆర్‌బీ	వర్ధన్నపేట (సీఐ)
కె. శ్రీనివాస్	వర్ధన్నపేట	సీసీఆర్
ఆర్. సంతోష్	ఆత్మకూరు	పర్వతగిరి (సీఐ)
ఎ. శ్రీనివాస్	వరంగల్ పోలీసు కమిషనర్	ధర్మసాగర్

విద్యుత్తు సమస్యల పరిష్కారానికి స్థానిక కోర్టులు

సుబేదారి, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో స్థానిక కోర్టులను ఏర్పాటు చేస్తున్నామని ఫోరం ఛైర్‌పర్సన్ నాగప్రసాద్ సోమవారం తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. సరఫరాలో అంతరాయం, విద్యుత్ హెచ్చుతగ్గులు, మీటర్లు, విద్యుత్ బిల్లుల్లో లోపాలు, సేవల్లో జాప్యం వంటి సమస్యలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు. జనగామ సర్కిల్ పరిధిలోని జనగామ, దేవురుప్పుల సబ్‌డివిజన్ పరిధిలోని వినియోగదారులు సెప్టెంబరు 2న దేవరుప్పుల ఉప కేంద్రంలో దేవురుప్పుల, సింగరాజుపల్లె, లింగాల ఘన్‌పూర్ మండలాలకు చెందినవారు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

'టాస్' ప్రవేశాల గడువు పొడిగింపు

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: ఈ విద్యాసంవత్సరానికి గాను తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టాస్) ద్వారా పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు గడువును నిర్ణీత ఫీజుతో ఈనెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు కలెక్టర్(ఇన్‌ఛార్జి డీఈవో) సందీప్‌కుమార్ ఝా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. టాస్ డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఆన్‌లైన్ ద్వారా ప్రవేశ దరఖాస్తుల సమర్పణ, అప్‌లోడ్ ప్రక్రియ ఈనెల 1 నుంచి 15 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. విద్యను మధ్యలో నిలిపివేసిన వారు, ఉద్యోగులు, గృహిణులు, ఇతర అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

దోమల మందు పిచికారీ

నర్మెట్ట, న్యూస్‌టుడే: గ్రామస్థుల ఆరోగ్యమే ప్రధాన కర్తవ్యంగా గ్రామ పంచాయతీ పాలక వర్గం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా గ్రామంలోని అన్నివార్డుల్లోని మురుగు కాలువల్లో, ఖాళీ స్థలాల్లో దోమల, గడ్డి మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా సర్పంచి గోపగోని శ్రీధర్‌గౌడ్ మాట్లాడుతూ..వర్షాకాలం దృష్ట్యా దోమల బెడద ఎక్కువగా ఉండటంతో మలేరియా, డెంగీ, వంటి ప్రమాదకర వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజల నివాసప్రాంతాల్లో మురుగు నీరు నిలువకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి స్వామి, వార్డు సభ్యులు యాదగిరి, బాపురాజు, బాలకృష్ణ, యాదలక్ష్మి,చంద్రయ్య, శ్రావణి, పాల్గొన్నారు.

రహస్యంగా రేషన్ బియ్యం దందా..

డబుల్ బెడ్‌రూమ్ ఇంట్లో నిల్వల పట్టివేత

మరిపెడ, న్యూస్‌టుడే: పేదలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. మరిపెడ పట్టణ శివారులోని అయ్యప్పస్వామి ఆలయం సమీపంలోని ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమూహంలోని ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా నిల్వ ఉంచిన 500 పైచిలుకు బస్తాల్లో సుమారు 283 క్వింటాళ్ల బియ్యం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయివర్ధన్ రెడ్డి నేతృత్వంలోని అధికారులు గణేష్, ముత్తయ్యలు దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. కేసముద్రం మండలానికి చెందిన ఓ రైస్ మిల్లుకు చెందిన ప్రస్తుత ఘటనపై అధికారులు పూర్తిస్థాయి విచారణ చేపట్టి బియ్యం నిల్వ రికార్డులు, రవాణా వివరాలు, సంబంధిత వ్యక్తుల గత కేసుల వివరాలను పరిశీలిస్తే మరిన్ని వాస్తవాలు తెలిసే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.

(c) eenadu